క్లుప్తంగా

పేదలకు అన్నదానం



గురజాల: దాతల సహకారం మరువలేనిదని స్మైల్ ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం అన్నారు. స్థానిక పాతపాటేశ్వరి అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో నిరుపేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫౌండేషన్ అభివృద్ధికి ప్రతి ఒక్కరి సహాయ సహకారాలు అందుతున్నాయని సహాయం చేసిన వారిని మరువలేమన్నారు. గురజాలకు చెందిన పద్మం శ్రీనివాసరావు కుమార్తె సురేఖ జన్మదినంను పురస్కరించుకుని పేదలకు అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బండి రవికుమార్, నారదాసు సతీష్, కటికల నాగేశ్వరరావు తదితరులున్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించటం జరుగుతుందని కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్నారు. ఈ సమావేశానికి కౌన్సిల్ సభ్యులంతా హాజరు కావాలని ఆయన సూచించారు.

కారెంపూడి ఎంఈఓ-1గా శ్రీనివాసరెడ్డి

కారెంపూడి: కారెంపూడి మండల విద్యాశాఖాధికారి 1గా మాచవరం మండలం పిల్లుట్ల ప్రభుత్వ హైస్కూల్ హెచ్ఎం ఎ.శ్రీనివాసరెడ్డి నియమిస్తూ పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. ఆయనకు ఫుల్ అడిషనల్ చార్జెస్ (ఎఫ్ఏసీ) బాధ్యతలు అప్పగించారు. వెంటనే విధుల్లో చేరాలని శ్రీనివాసరెడ్డిని ఆర్‌జేడీ ఆదేశించారు. ఇక్కడ ఎంఈఓ 1గా పని చేస్తున్న కె.కాంతారావును శ్రీనివాసరెడ్డికి తక్షణమే బాధ్యతలు అప్పగించాలని ఆదేశాలిచ్చారు. అడ్మినిస్ట్రేటివ్ గ్రౌండ్స్‌లో కాంతారావు స్థానంలో కారెంపూడి ఎంఈఓ 1గా శ్రీనివాసరెడ్డిని ఆర్‌జేడీ నియమించారు.

రోడ్ల వెంట చెత్త వేయవద్దు



పిడుగురాళ్ల: ప్రధాన రహదారి వెంట ఎవరు చెత్త వేయవద్దని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని మెయిన్ రోడ్డులోని మున్సిపల్ కార్మికుల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారస్తులు రోడ్డు వెంబడి చెత్త వేయటం వలన గాలికి ఒక చోట లేకుండా పోతుందని, మిగిలిన షాపుల వారికి కూడా ఇబ్బందులు కలుగుతున్నాయని, వ్యాపారస్తులు పొడి చెత్త, తడి చెత్తలను వేరు చేసి ప్యాక్ చేసి ఒక చోటు వడితే సరిపోతుందని ఆయన తెలిపారు. విడిగా చెత్త వేయటం వలన మున్సిపల్ కార్మికులకు సమస్యగా మారుతుందని ఆయన తెలియజేశారు. మున్సిపల్ శానిటేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అనారోగ్యంతో మహిళా పోలీస్ మృతి



సాతులూరి పవిత్ర (ఫైల్)

మాచవరం: వేమవరం గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా పనిచేస్తున్న సాతులూరి పవిత్ర (24) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. గత కొన్ని రోజుల క్రితం కామెర్లు సోకగా, సరైన సమయంలో గుర్తించలేక పోయారు. దీంతో తీవ్ర అనారోగ్యానికి గురై పిడుగురాళ్ల ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. పవిత్ర మృతిపై సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు సంతాపం వ్యక్తం చేశారు.

రక్షణ చర్యలతో దీపావళిని జరుపుకోవాలి



కారెంపూడి: బాణ సంచా కాల్చేటప్పుడు ప్రజలు జాగ్రత్తగా ఉండి తగిన రక్షణ చర్యలు తీసుకుని దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కారెంపూడి సీఐ టీవీ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బాణ సంచా విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలని రక్షణ చర్యలు తీసుకుని షాపులు ఏర్పాటు చేసుకుని విక్రయాలు జరుపుకోవాలని సూచించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

దాచేపల్లి: దొంగతనం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ జి.పాపారావు మంగళవారం తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో నడికుడిలోని ఓ ఇంటిలో జరిగిన చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, విచారణలో గురజాల మండలం చర్లగుడిపాడుకి చెందిన అచ్చి చిన్న సైదారావు చోరీకి పాల్పడినట్లుగా గుర్తించామని ఆయన చెప్పారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచినట్లు ఆయన వెల్లడించారు.

ప్రమాదాల జంక్షన్లు!

- అద్దంకి – నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై ప్రమాదాల నిలయంగా మారిన కూడళ్లు
- ప్రతి రోజూ ఏదో ఒక ప్రమాదం సంభవిస్తున్న వైనం
- రోడ్డుపై హెచ్చరిక బోర్డులు మృగ్యం
- హైవే అధికారుల పర్యవేక్షణ అంతంతమాత్రం



ప్రమాదకరంగా పిడుగురాళ్ల పట్టణంలోని ఖలీల్ దాబా జంక్షన్

పిడుగురాళ్ల: రాష్ట్రం నుంచి తెలంగాణకు, తెలంగాణ నుంచి రాష్ట్రానికి నిత్యం వందల సంఖ్యలో ఆ రహదారిపై వాహనాలు పయనిస్తూ ఉంటాయి. వేలాదిగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అయితే హైవే అథారిటీ అధికారులు జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఎంతో ప్రాధాన్యమున్న ఆ రహదారిపై ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. అద్దంకి – నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. హైవే కావటంతో కార్లు, లారీ వంటి వాహనాలు వేగంగా ప్రయాణం సాగిస్తూ ఉంటాయి. పిడుగురాళ్ల పట్టణంలోకి రోడ్డు రాకుండా పట్టణం చుట్టూ 6 కిలోమీటర్ల మేర బైపాస్ రహదారి హైదరాబాద్ వైపు ఖలీల్ దాబా నుంచి కొండమోడు వద్ద జంక్షన్ వరకు నిర్మాణం చేశారు. ఖలీల్ దాబా వద్ద, కొండమోడు జంక్షన్‌కు ముందు మరో జంక్షన్ ఏర్పాటు చేశారు. పిడుగురాళ్ల పట్టణం వైపు నుంచి వచ్చే వాహనాలు, బైపాస్ నుంచి పిడుగురాళ్ల పట్టణానికి వాహనాలు వెళ్లేందుకు అనువుగా ఈ జంక్షన్‌లను అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి దగ్గర ఉండి ఏర్పాటు చేయించారు.



ఇటీవల జరిగిన ప్రమాద దృశ్యం

నియంత్రణ ఏదీ..?

గతంలో నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే లిమిటెడ్ వారు, పోలీసు వారు సంయుక్తంగా ఇద్దరు సిబ్బందిని కూడళ్ల వద్ద ఏర్పాటు చేశారు. వారు నిరంతరం ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా, ప్రమాదాలు జరగకుండా వాహనాలు సక్రమంగా వచ్చే విధంగా, వేగంగా రాకుండా చర్యలు తీసుకునేవారు. కానీ నేడు పోలీస్ వారు కానీ, నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే లిమిటెడ్ వారు కానీ ఈ కూడళ్ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేయకపోవటంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

ప్రతిరోజూ ఏదోక ప్రమాదం జరుగుతూనే ఉంది



నిత్యం ఖలీల్ దాబా వద్ద, కొండమోడు జంక్షన్ వద్ద ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉంది. ప్రమాదాలు జరగకుండా పెద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– మాదాల కిరణ్‌కుమార్, 9 వార్డు కౌన్సిలర్, పిడుగురాళ్ల

గతంలో సిబ్బంది ఉండేవారు



గతంలో సిబ్బంది ఉండి ప్రమాదాలు జరగకుండా వాహన దారులను అప్రమత్తం చేసేవారు. రాత్రిళ్లు సైతం ఏదేని అనుకోని ఘటన జరిగితే క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించడం, పోలీసులకు సమాచారం చేరవేయడం వంటివి చేసేవారు. ఇప్పుడు పర్యవేక్షణ లేకపోవడంతో రాత్రిళ్లు యాక్సిడెంట్లు చేసేసి ఎవరికీ దొరక్కుండా ఉడాయిస్తున్నారు.

– ముక్కాల నిరంజన్ బాబు, పిడుగురాళ్ల

రెండు జంక్షన్లలో పలు ప్రమాదాలు..

పిడుగురాళ్ల పట్టణం ఈ నెల 12వ తేదీన పిడుగురాళ్ల పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మరో వ్యక్తి కలిసి పిడుగురాళ్ల వైపు వస్తూ ఉండగా ఖలీల్‌దాబా వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో వెంకటేశ్వర్లు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. అదేవిధంగా 16వ తేదీన రెండు ద్విచక్ర వాహనాలు కూడలివద్ద ఎదురెదురుగా ఢీకొనటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. 26వ తేదీన పిడుగురాళ్ల వైపు నుంచి చినగార్లపాడు వైపు ద్విచక్ర వాహనంపై బిళ్ల కోటేశ్వరరావు, బత్తుల లింగాలు, చల్లా నాగరాజులు వెళ్తుండగా ఖలీల్ దాబా కూడలి వద్ద వేగంగా కారు ఢీకొనటంతో బైక్‌పై ఉన్నవారిలో ఒకరికి తీవ్ర గాయాలుకాగా, ఇద్దరికి గాయాలయ్యాయి. గుంటూరు వైపు ఉన్న కొండమోడు వద్ద హైవే జంక్షన్, హైదరాబాద్ వైపు వెళ్లే ఖలీల్ దాబా వద్ద ఉన్న జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే, పోలీస్ వారు కూడళ్ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాల్లో కూడా కనిపించే విధంగా పెద్ద పెద్ద బోర్డులను ఏర్పాటు చేయాలని, తద్వారా ప్రమాదాలను నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పునీత ఆంథోని అడుగుజాడల్లో నడవాలి

విచారణ గురువులు రెవ.ఫాదర్ జాకోబు రెడ్డి



సమష్టి దివ్యపూజాబలిని సమర్పిస్తున్న రెవ.ఫాదర్ జాకోబురెడ్డి, ఫాదర్ అగస్టీన్

రెంటచింతల: ఏసుక్రీస్తు సూక్తులను ఆచరిస్తు ప్రతి కథోలికులు పునీత ఆంథోనివారి అడుగుజాడల్లో నడిచి సమాజంలో ఇరుగు పొరుగు వారితో ప్రేమతో మెలుగుతూ జీవించాలని మేళ్లవాగు రెడ్డిపాలెం విచారణ గురువులు రెవ. ఫాదర్ జాకోబురెడ్డి అన్నారు. స్థానిక ఆంథోనివారి కాలనీలోని పునీత ఆంథోనివారి మందిరంలో 9 మంగళ వారోత్సవాలలో భాగంగా రెండవ మంగళవారం పురస్కరించుకుని కానుకమాత చర్చి సహాయ గురువులు అగస్టీన్‌తో కలిసి ఆయన ప్రత్యేక సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. కథోలికులు ప్రతి రోజు క్రమం తప్పకుండా కుటుంబ ప్రార్థన చేసినట్లయితే ఆ కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరుస్తాయన్నారు. క్రీస్తు చూపిన బాటలో నడిచి ఆంథోనివారు పునీతులయ్యారన్నారు. ఈ ప్రత్యేక పూజాబలిలో పాల్గొన్న వందలాది మంది భక్తులకు దివ్యసత్ప్రసాదంను పంపిణీ చేశారు. కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్థుమర్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమష్టి దివ్యపూజాబలిలో కన్యాస్త్రీలు, మందిరం పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ధ్యేయం కావాలి



పర్యావరణ పాఠాలు బోధిస్తున్న జాజి

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పర్యావరణవేత్త కొమెర అంకారావు (జాజి) మంగళవారం ప్రకృతి పాఠం బోధించారు. పాఠశాల మైదానంలోకి తీసుకెళ్లి పాఠశాలలో ఎలాంటి మొక్కలు నాటుకోవాలి, వాటి సంరక్షణ ఎలా చేయాలనే విషయమై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మొక్కలు నాటి సంరక్షించడం కూడా దేశ సేవ కిందే లెక్కని, భావి తరాల కోసం మనల్ని మనం రక్షించుకోవడం కోసం పర్యావరణ పరిరక్షణ అత్యంత అవసరమైనదిగా అందరూ గుర్తించాలని వివరించారు. పరిసరాల పరిశుభ్రతపై ఇంట్లో అవగాహన కల్పించాల్సిన బాధ్యతను భావిభారత పౌరులుగా విద్యార్థులు స్వీకరించాలని కోరారు. వివిధ రకాల ఔషధ మొక్కలను పరిచయం చేశారు. గ్రామాలలో ఎక్కడ చూసినా రోడ్ల పక్క ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతోందని భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారని, దీనికి పర్యావరణ పరిరక్షణ ఒక్కటే మార్గమన్నారు. పరిష్కారంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ప్లాస్టిక్ వాడకూడదని హితవు పలికారు. అనాదిగా మానవ మనుగడ అడవులతోనే ముడిపడి సాగిందని విషయాన్ని మరవరాదని, విద్యార్థులచే పర్యావరణ పరిరక్షణకు ప్రతిజ్ఞ చేయించారు.

బాక్సింగ్ పోటీలకు ఏఎంజీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి

చిలకలూరిపేట: ప్రముఖ స్వచ్ఛంధ సంస్థ ఏఎంజీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విజయవాడలో ఈనెల 27 నుంచి 29 వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ –19 బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు బాలుర విభాగంలో కాకి అభిషేక్, బాలికల విభాగంలో బత్తుల అమృతమయి విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిద్దరు త్వరలో ఢిల్లీలో నిర్వహించే జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారు. వీరితో రాష్ట్ర స్థాయి పోటీల్లో పి.గోపి, సింధు, రజిని, హేమ, సాధన క్యాంస పతకాలు సాధించారు. ఈ విద్యార్థులకు స్కూల్ ప్రాంగణంలో మంగళవారం ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి అభినందన కార్యక్రమం నిర్వహించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ నాయకులు

చిలకలూరిపేట: ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఏరియా కార్యదర్శి మేకపోతుల నాగేశ్వరరావు కోరారు. సీపీఐ కార్యాలయంలో ఏఐఎస్ఎఫ్ ఏరియా జనరల్ బాడీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాసంస్థలు ఫీజులు చెల్లిస్తేనే సెమిస్టర్ పరీక్షలు రాయనిస్తామని, లేకుంటే హాల్ టికెట్లు ఇవ్వమని బెదిరింపులకు పాల్పడుతున్నాయన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం పేరును తల్లికి వందనం అని పేరు మార్చిన కూటమి ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నగదు మాత్రం జమచేయడం లేదని విమర్శించారు.

కందిలో సస్యరక్షణ చేపట్టాలి



రెంటచింతల: ఖరీఫ్‌లో కంది పంటకు ఆశించే పచ్చ పురుగు, మచ్చల పురుగు, రసంపీల్చు పురుగు వంటి క్రిమికీటకాలు ఎక్కువగా నష్టం కలిగిస్తాయని వాటి నిర్మూలనకు రైతులు వ్యవసాయాధికారుల సూచనలతోనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పాలువాయి, తుమ్మకోట గ్రామాలలోని రైతులకు ఏర్పాటు చేసిన సమావేశాలలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌లో కంది పంటకు ఆశించే చీడపీడల నివారణకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి పలు సూచనలు చేశారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శావల్యాపురం: అర్హత కల్గియున్న లబ్ధిదారులందరూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు కె.సుజాత అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు గ్యాస్ కనెక్షనుతో పాటు తెల్లరేషను కార్డుదారులు అర్హత పొందుతారన్నారు. గ్యాస్ కనెక్షన్, రేషన్ ఆధార్ కార్డు ఉన్న వారందరూ గ్యాస్ కార్యాలయంలో ఈకేవైసీ నమోదు చేయించుకోవాలన్నారు. సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు దఫాలు వారీగా ఉచితంగా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఆన్‌లైన్ విధానంలో నమోదు చేసుకున్న గ్యాస్ కనెక్షన్ లబ్ధిదారులు నగదు చెల్లింపులు చేసిన రెండు రోజుల వ్యవధిలో వారి బ్యాంకు ఖాతాలోకి నగదు జమ చేస్తుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పట్టభద్రులు తమ ఓటు హక్కు కోసం తగిన విద్యార్హత పత్రాలతో తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రంగా విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

కాపు జేఏసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జక్కా రవి

గురజాల రూరల్: కాపు నాయకుడు వంగవీటి రంగా విగ్రహం ధ్వంసం చేసిన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలని కాపు జేఏసీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జక్కా రవి అన్నారు. ఆయన తన కార్యాలయంలో మంగళవారం మాట్లాడుతూ మాచవరం మండలం వేమవరం గ్రామంలో ఆదివారం రాత్రి వంగవీటి మోహన రంగా విగ్రహం ధ్వంసం ఘటనపై విచారణ జరిపి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలన్నారు.

వంగవీటి రంగా విగ్రహ ధ్వంసం హేయం

రెంటచింతల: బడుగు, బలహీన, తాడిత, పీడిత, ప్రజా నాయకుడిగా పేరు పొందిన వంగవీటి రంగా విగ్రహాన్ని ఆగంతకులు ధ్వంసం చేయడం హేయమని కన్నెగంటి హనుమంతు ఫౌండేషన్ అధ్యక్షుడు నారాయణపురం శ్రీనివాసరావు ఖండించారు. మంగళవారం రెంటచింతలలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడు జిల్లా మాచవరం మండలం వేమవరం గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుందన్నారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన దేశ నాయకులు, ప్రజా నాయకుల విగ్రహాలను ధ్వంసం చేయడం నీచమైన చర్యగా ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

'పట్టభద్రుల' దరఖాస్తులు పరిశీలించాలి



సీఐటీయూ కార్యాలయంలో పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఐ వెంగయ్య

మాచర్ల: పట్టణంలో గ్రాడ్యుయేట్ పూర్తి చేసిన వారు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో గెజిటెడ్ సర్టిఫికెట్‌తోపాటు, ఎటాచ్డ్ పత్రాలు ఉద్యోగులకు అందజేయడం, సమాచారం ఇవ్వాలని కమిషనర్ డి.వేణుబాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పురపాలక సంఘ ఆర్ఐ వెంగయ్య మాట్లాడుతూ పట్టభద్రులు నవంబరు 6వ తేదీలోపు నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరి వివరాలు సేకరించి దరఖాస్తు ఫారాలు పూర్తి చేయాలన్నారు. సచివాలయ ఉద్యోగులు బాధ్యతతో వారం రోజులు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరి దరఖాస్తు దారుని అర్హతలు పరిశీలించి, వివరాలు సేకరించాలన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో 900 దరఖాస్తుల వచ్చాయని, ఇంకా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఆయా సచివాలయాల ఉద్యోగులు, అడ్మిన్‌లు, వెల్ఫేర్ ఆఫీసర్‌లు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం

మాచర్ల: పట్టణంలోని సీఐటీయూ ప్రాంతీయ కార్యాలయంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి కె.ఆదినారాయణ పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. సీఐటీయూ నాయకుడు మహేష్ మాట్లాడుతూ పట్టణతోపాటు, మండల పరిధిలోని పట్టభద్రులందరూ నవంబరు 6వ తేదీలోపు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. 2021 సెప్టెంబరు 30 లోపు డిగ్రీ పట్టా పొందినవారు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పల్నాడు జిల్లా కన్వీనర్ కోటా సాయికుమార్, పిడుగురాళ్ల పట్టణ అధ్యక్షుడు కె.రోహిత్ ఆనంద్, ఎం.ప్రవీణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఇతర వివరాల కోసం 9703411948 నంబరులో సంప్రదించాలన్నారు.

పత్తిలో మెగ్నీషియం లోపం కనిపిస్తోంది

ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు



మాట్లాడుతున్న ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం: పత్తి పంటలో మెగ్నీషియం లోపం కనిపిస్తుందని నివారణకు ఎకరానికి 10 కేజీల మెగ్నీషియం సల్ఫేట్‌ను చల్లుకోవాలని ఏడీఏ బి.శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. మండలంలోని మల్లవోలు, కొత్తగణేశునిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరప పంటలో పశువుల ఎరువు, వేప పిండి, ట్రైకోడర్మా విరిడి కలిపి పొలంలో వాడుకోవాలని సూచించారు. పిడుగురాళ్ల పరిధిలోని లక్ష్మీగణపతి కాటన్‌మిల్లు, అమరలింగేశ్వర ఎంటర్‌ప్రైజెస్ పత్తి మిల్లులకు పత్తి కొనుగోలు కేంద్రాలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రైతులు ముందుగా ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని తెలియజేశారు. పత్తికి మద్దతు ధర రూ.7521గా నిర్ణయించడం జరిగిందని, తేమశాతం ఆధారంగా కొనుగోలు చేస్తారని చెప్పారు. ఏఓ కె.రామమ్మ, వ్యవసాయ సహాయకులు సతీష్, డి.ప్రభాకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

దాచేపల్లి: మండలంలోని రామాపురంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రంకి చెందిన డాక్టర్ జి.రమేష్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ కేవీకే, స్థానిక ఏఓ డి.పాపకుమారి రైతులు సాగు చేస్తున్న పత్తిపంటలను పరిశీలించారు. అంతరసాగు పద్ధతిలో సాళ్ల మధ్య దూరం, మొక్కల మధ్య దూరం తగ్గించి వేయటం వలన పొలాల్లో సంప్రదాయ పద్ధతి కన్నా ఎక్కువ మొక్కలను పెంచుకోవచ్చని సూచించారు. దీని వలన దిగుబడి పెరగటంతో పాటుగా లాభాలు కూడా పొందవచ్చునని తెలిపారు.

హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్ ప్రారంభం



సెంటర్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

మాచర్ల: స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్టు సేవా కార్యక్రమాలు అభినందనీయమని జూలకంటి అక్కిరెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం సిస్టర్ నివేదిత 158 జయంతి ఉత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీశైలం రోడ్డులో స్వామి వివేకానంద సేవా ఆశ్రమంలో హ్యూమన్ ఎక్సలెన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి ట్రస్టు ఫౌండర్ మెట్టు గోవిందరెడ్డి అధ్యక్షత వహించారు. స్వామి వివేకానంద సంస్థ ద్వారా వేసవి సెలవుల్లో విద్యార్థులకు పాలిటెక్నికల్, ఏపీఆర్‌జేసీ, కంప్యూటర్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లిషు కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో హ్యాపీ ఆర్ట్ ఫౌండేషన్ రామకృష్ణ, అన్నపరెడ్డి తిరుపతిరెడ్డి, తుమ్మాజోజిరెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, మాచర్ల పట్టణ వైద్యుడు గుర్రం రాజశేఖరరెడ్డి, సంస్థలకు చెందిన ఉపాధ్యాయులు, సీహర్ష కళాశాల డైరెక్టర్ రాజశేఖరరెడ్డి, జానీబాషా, రిటైర్డ్ హెచ్ఎం పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆకుకూరలు, పండ్లతో మంచి ఆరోగ్యం



ఫాతిమా విద్యానికేతన్‌లో ఏర్పాటు చేసిన పండ్లు, ఆకుకూరల ప్రదర్శనలో డైరెక్టర్ మర్రెడ్డి

రెంటచింతల: ఆకుకూరలు, పండ్లతో విద్యార్థులకు పౌష్టికాహారం లభిస్తుందని స్థానిక ఫాతిమా విద్యానికేతన్ స్కూల్ డైరెక్టర్ ఏరువ ఫాతిమా మర్రెడ్డి అన్నారు. మంగళవారం విద్యార్థులు వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు సేకరించి పాఠశాలలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫాతిమా మర్రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కలుషిత ఆహార పదార్థాలు తీసుకోవడం వలన చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. విద్యార్థులకు ఆకు కూరలు, కూరగాయలు, తాజా పండ్లు తినడం వలన మంచి ఆరోగ్యం సమకూరుతుందని తెలిపారు. హెచ్ఎం ఏరువ స్టేఫీస్టార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి



దుకాణదారులతో సమావేశమైన తహసీల్దార్, ఎస్ఐ

దుర్గి: దీపావళి పండుగ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న టపాసుల దుకాణాలకు అనుమతి తప్పనిసరి అని తహసీల్దార్ ఐ.ఫణీంద్ర కుమార్, ఎస్ఐ ఎల్.సుధీర్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దుకాణదారులతో సమావేశం ఏర్పాటు చేసి వారు మాట్లాడారు. కమర్షియల్ డిపార్ట్‌మెంట్ నుంచి క్యాజువల్ ట్యాక్స్ పేయర్, జీఎస్టీ పేమెంట్ కట్టిన నకలును తహసీల్దార్ కార్యాలయంలో అందజేసి లైసెన్స్ కోసం అర్జీ దాఖలు చేసుకోవాలని కోరారు. అనుమతులు లేకుండా మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలలో దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు.

పోక్సో కేసులో నిందితుడు అరెస్ట్

నరసరావుపేటటౌన్: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ మంగళవారం తెలిపారు. స్థానిక శ్రీరాంపురంకు చెందిన 16 ఏళ్ల మైనర్ బాలికను ఈ నెల 22వ తేదీన మల్లెపల్లి తండాకు చెందిన రమావత్ వెంకటేశ్వరనాయక్ కిడ్నాప్ చేసి తీసుకెళ్లాడు. బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కిడ్నాప్ మరియు పోక్సో కేసు నమోదు చేశారు.